# 9

## బి. పౌరుడు

[ఇది ఒక పెద్ద కార్టూనులాంటి కథ. ఇట్లాంటి దానికి ప్రయోజనం వుంటుంది. కాని—అది అంత చప్పున బయటపడేటట్టుండదు. ఇటువంటి కథల్లో ఒకొక్కసారి 'విధానం' పెద్దదయి 'విషయం' కనుమరుగయిపోవడం కద్దు. ఆ గ్రహపాటు ఇందులోనూ జరిగిందేమో పాఠకులు చెప్పాలి.

ఈ కథలోలాటి ఆఫీసర్లు నాకు ఎదురవడమే కాదు, నేనట్లాటి వారి కింద పనిచేసే 'అదృష్టమూ' కలిగింది. ఇహ ఈ విషయానికి ఈ ఆకారం ఇవ్వడానికి నన్ను ప్రేరేపించింది 'ఎవ్‌లీన్ వా' అన్న ఆంగ్లరచయిత వ్రాసిన ఒక నవల. దాని పేరు సరిగా గుర్తులేదు; బహుశా 'పుట్ అవుట్ మోర్ ఫ్లాగ్స్' ఏమో. ఆ నవలలో బాంబులమ్మే పాత్ర ఒకటి కనిపించింది. ఆ పాత్రనుమాత్రం గ్రహించి. అతడి చుట్టూ మన సమకాలీన జీవితంలో కనిపించే కొన్ని 'అధికార రోగ పూరిత బధిరాంధక శవా'లను చేర్చి వ్రాసిన కథ ఇది.

ఈ కథయొక్క మరొక్క ఘనత—ఇది చాలా పత్రికల చేత నిరాకరింపబడడం. అందుకు కారణం ఏమిటో ఇప్పటికీ తెలియలేదు నాకు. 'అధికారా'న్ని విమర్శించడం నచ్చక పోవడమో, లేక కథ కేవలం బాగులేక పోవడమో అయ్యుండాలి. ఏమంటారు?

గరటయ్యా మహానగరంలోకి దిగాడు.

అంటే పేరచూటు నుండో, విమానం నుండో అని కాదు. మామూలుగా చేరాడూ-అని అర్థం. గరటయ్యా మహానగరానికి కొత్త కాదు. మహానగరం గరటయ్యాకూ అంతే .... కాని అయిదోఫారం దాకా చదివి వూరుకున్న గరటయ్యా నవీన భారతంలో నేర్చుకోవలసినవి చాలా వుండిపోయినాయి.

సదరుశాస్త్రి ఒకానొక శుభముహూర్తాన మహానగరపు మధ్య రోడ్డుప్రక్కన, ఒక బస్‌స్టాపులో నిలబడింది. చేతివాచీ తొమ్మిదింబావు చూపించగా కేవలం కౌతుకంకొద్దీ పక్కనే నిలిచివున్న చేతగొడుగు దాల్చి నాయన గడియారాన్ని గమనించాడు గరటయ్యా. అక్కడ తొమ్మిదీ నలభైరెండు అయింది. ఎదుట నిల్చున్న కార్పొరేషన్ భవనపు నెత్తిమీది గడియారంలో అపుడపుడే ఒకటీ యాభైరెం డవవస్తూంది: మంత్రివర్గంలోని మంత్రులందరూ తలో స్టేట్‌మెంటూ ఇచ్చేరీతిగా గడియారాలు కూడా 'టైము' చూపించడం గరటయ్యాకు బొత్తిగా నచ్చలేదు. ఆ పరిస్థితులలో తన గడియారాన్ని నమ్ముకోవడమే శ్రేయస్కరమనుకుని కాస్త వికేంద్రీకరించాడు. పదినిముషాలముందు తను 'క్యూలో' చివరివాడుగా నిల్చున్నాడు. ఇప్పుడు చూస్తే-తనతర్వాత-ఆ 'క్యూ' పెరిగిపోయింది, పొడుగ్గా, వేగంగా, వంకరగా - కాలేజి జవ్వనుల ప్రణయంలా-ఎన్జీవో అప్పులతోరణంలా.

ఆ 'క్యూ'లో-గరటయ్యా పక్కనున్న చేతగొడుగాయన కవతల నిల్చుందొక సన్నటి నాగరికమణి. ఆ మణిచేతనుందొక మణుగున్నర పుస్తకం. మెడచాచి, చూచి ఆ మణుగున్నర సరుకూ 'సైకాలజీ' అని తెలుసుకున్నాడు గరటయ్యా. తెలుసుకుని వూరుకోక, ఆ నాగరిక సన్నమణిలో 'సైకాలజీ' కాస్త తక్కువయి, 'ఫిజియాలజీ' ఇంకాస్త ఎక్కువుంటే బాగుండిపోయేది అనుకున్నాడు. ఆ అనుకోవడం అయిపోయేలోపుగా ఎందరో ఇందరు ఎదురు

చూస్తున్న బస్సు కాస్తా వచ్చింది. అది వచ్చీరాగానే అంతవరకూ ఇంచక్కా వరాసగా నిల్చున్న కుర్రకారంతా ఘూమ్మున కలగా పులగ మయిపోయారు. ఆ బస్సాయణంలో తొక్కుడుపేట మొదలయింది. చేతిగొడుగాయన మూర్కు గొడుగుకాడ సన్నమణి భుజానికి తగుల, ఆయనచేతి మణుగున్నర 'సైకాలజీ' ఒక 'అనీమియా' కుర్రవాడి నెత్తిన రాల, అల వాడి చిందులకు ప్రక్కాయన కళ్ళజోడు తల క్రిందులవ, ఆయన పదవిన్యాసాలకు గరటయ్య కుడిపాదం భగ్గు మన-బస్సు తుస్సుమంది. ధూళీ, గరటయ్యా మిగిలిపోయారు.

కుడిపాదాన్ని ఉరిమిచూశాడు గరటయ్య. ఉన్నదానివి ఆ ఎడమ పాదంలా వూరికే వుండక, ఆ కళ్ళజోడు వాడి పాదముల క్రిందికి పోనేల, ప్రస్తుతము భగ్గుమననేల అని కసిరాడు కాస్సేపు. తర్వాత 'ఉఫ్' మని ఊదుకున్నాడు. ఈలోపుగా వెళ్ళిపోయింది ఇంకొక బస్సు. మళ్ళీ పోగయ్యారు జనం.

ఎట్టకేలకొక బస్సు నందుకున్నాడు గరటయ్య. అప్పుతెచ్చిన డబ్బులా ఘూమ్మని వెళ్ళిపోతూంది బస్సు. వెనక్కుపోతున్న దృశ్యా లని గమనిస్తూ గడ్డం తడువుకున్న గరటయ్య గతుక్కుమన్నాడు. పొద్దున్న బస్సుకోసం నిల్చున్నప్పుడు నున్నగావున్న గడ్డం ఇప్పుడు పనసతోలులా గరగరలాడి పోతూంది....టిక్కెట్టుకు డబ్బులిచ్చి, టైమును చూచుకుందామనుకునేసరికి-చేతిమీద వాచీలేదు! 'ఎవడో మరి....ఎంత లాఘవంగా కొట్టేశాడో'-అని ఆ అజ్ఞాతవీరుడి 'హస్తకళ'కు ఆశ్చర్యపడిన గరటయ్య చూపుకెదుట 'జేబు దొంగ లున్నారు జాగ్రత్త!' అన్న బోర్డు వేలాడుతూంది. 'మరి చేతివాచీల సంగతేవిటి-దాన్ని గురించి హెచ్చరిక ఏదీ లేదేం' అని నిరసించాడు గరటయ్య....ఎవరన్నా ఎమ్మెల్యేచేత మంత్రిగారిని అడిగిద్దాములే అని సమాధానం చెప్పుకున్నాడు.

చిట్టచివరకు గమ్యం చేరాడు గరటయ్య.

సర్వవిధ పర్మిట్లూ, లైసెన్సులూ, మరియూ సలహాలూ, ఇంటర్‌వ్యూలూ, బియ్యేవ్యూలూ ఇచ్చే కార్యాలయ మయ్యది.

ఆ అయిదంతస్తుల భవంతిముందర వుందొక అందమయిన వనం. 'ఆహా! ఏమి ఈ ఉద్యానవనము! ఇంతటి యాంత్రిక జీవితం నడుమ రవ్వంత ప్రకృతిని తెచ్చిపడేశారే'-అని విస్తుపోతూ లోపలికి పోబోయిన గరటయ్యను గట్టిగా ఆపాడు ఒక తారాసింగు.

"ఆప్‌కా పాస్ కహా(?"

అప్పుడర్థమయింది గరటయ్యకు. ఈ కార్యాలయంలోకి పోవడానికి పాసొకటి ఏడవాలని. గూర్ఖా చూపించిన 'ఎంక్వైరీ' అన్న 'బూత్' దగ్గరకు వెళ్లాడు. అక్కడ కటకటాల వెనకవున్న గుమాస్తా ఇచ్చిన ఫారాన్ని పూర్తిచేసి పావలా చెల్లించాడు, గరటయ్య. పూర్తిచేసిన ఫారాన్ని చూసిన గుమాస్తా-

"సార్! దీనివెనక ఎవరయినా గెజెటెడ్ ఆఫీసర్‌గాని,ఎమ్మెల్యే గాని సంతకం చెయ్యాలండి. లేకపోతే పాస్ దొరకదు" అన్నాడు.

"ఏం?" అన్నాడు వెర్రి గరటయ్య.

'ఏమేవిఁటి ఏమ్! అది రూల్సు!' అన్నాడు గుమాస్తా.

—మీరు మామూలుగా బజారు వెంబడి వెళుతూ వుంటారు. హడావిడిగా బోలెడు జనం ఇటూ అటూ వెళ్తుంటారు. ఇంతరగడ మధ్య-ఒక వ్యక్తి నేలమీద పాదాలానించకుండా తాపీగా వెళ్తుంటాడు. పై పెచ్చు ఆయనకు రెండుచేతులు ఎక్కువగా వుంటాయి. పిచ్చివాడిలా-ఒంటినిండా ఏవో తాళ్లూగొలుసులూ వేసుకుని వుంటాడు. ఎటూ ఇన్ని చేతులున్నాయిగా అని కాబోలు - వేరేమీ పని లేనట్టు ఒకచేత్తో చక్రం తిప్పుతుంటాడు....'ఎవరబ్బా ఈ శాల్తీ!' అని చాలా మథనపడిపోయి ఆ ప్రక్కనే వున్న కిళ్లీకొట్టు వాడినడుగుతారు. వాడంటాడు కదా....'ఎవరూ....ఆ వెళ్తున్నదేనా....శ్రీ మహావిష్ణువండీ!' అంటాడనుకోండి....అప్పుడెలా వుంటుంది మీ మనో వ్యవస్థ? అలా అయిపోయింది గరటయ్యకు.

'మామూలు మనిషి ఆలోచనకు సవ్యంగా తోచనిది ఏదయినా ఎదురయిందీ అంటే-దానికి 'రూల్సు' అని కొన్ని వుంటాయన్న

మాట. అయినా ఈ 'రూల్సు' యొక్క సృష్టికర్తలు ఎక్కడ వుంటారో-' అనుకున్నాడు గరటయ్య. ఇలా అన్నాడు: 'ఇపుడేమో అసెంబ్లీ సమావేశంలో లేదాయిరి....కనక గె.ఆఫీసరే శరణ్యం.... వాళ్ళకోసమని ఎందుపోవుడు-ఆ(___? ఈ కార్యాలయంలో చాలా మంది వుంటారుగా....వాళ్ళలో ఒకరిని అడిగితే ఆమాత్రం సాయం చెయ్యరూ? ఎందుకు చెయ్యరు? తప్పక చెయ్యుదురు-" అంటూ అదేదో తెలుగుసినిమాలోలాగా 'రిపీట్ డైలాగ్స్' తో అడుగులు వేశాడు. గభుక్కున వెనక్కు తిరిగిచూశాడు; ఆ గుమాస్తా భోరు మని నవ్వుతున్నాడు.

ఎందుకూ-అని మొహంపెట్టాడు గరటయ్య.

"అదికాస్సార్! ఆ కార్యాలయంలోకి పోవడానికేకదా మీకు 'పాస్' కావలసిందీ'' అన్నాడు వాడు.

ఓ క్షణంలో అర్థమయింది గరటయ్యకు-తా నెంతటి తికమకలో పడిపోయిందీ!-లోపలికి వెళ్ళాలంటే 'పాస్' కావాలి; ఆ 'పాస్' నిప్పించే ఫారంమీద సంతకం పెట్టవలసిన గె. ఆ. కావాలంటే లోపలికి వెళ్ళాలి. చిన్నప్పుడు 'అమరకోశం' చదివిన అతగాడి మెదడండి: 'కిం కర్తవ్యం' ''కిమ్మోలేమ కమ్మోలేమ నువ్వో కాసేపూరుకో'' అని గుమాస్తానే ప్రాధేయపడ్డాడు దారిచూపించమని.

''ఇపుడు నాలుగయిందిసార్ : ఇంకో పదినిముషాలలో సీ. ఓ. ఇ. ఇ. వస్తారు. ఆయనచేత సంతకంపెట్టిద్దాం....'' అని అభయమిచ్చాడు ఆ గుమాస్తా.

"ఆ ఏబీసీడీఈ గెజెటెడేనా?" తన సందేహాన్ని బయటికి వదిలాడు గరటయ్య. ఆ వాక్యానికి అర్థంతెలియక తన్నుకువచ్చే వాడు చిన్నయసూరి వుంటే.

"హి!'' అని రూల్సుప్రకారం నవ్వి. చెప్పాడు గుమాస్తా. ''చీఫ్ ఆఫీసర్ ఆఫ్ ఎన్ట్రెన్సెస్ అండ్ ఎగ్జిట్స్-అంటే ఏవ(ను కున్నారు-ఆయన క్రింద ముగ్గురు ఆఫీసర్లున్నారు....తలచుకుంటే

ఇరవయిరూపాయల పెన్సిళ్ళు ఒక్కసారే కొనే అధికారం వుంది ఆయనకు!''

"అబ్బా!'' అని తల గోక్కున్నాడు గరటయ్య-'' అయినా గేట్లకోసం ఇంతోటి ఆఫీసరెందుకూ-'' అని అడిగాడు.

"అయ్యో....మీరు దినపత్రికలు చదవరల్లేవుంది. ఆమధ్య ఓ పొదుపుకమిటీని వేశారు. ఈ గేట్లశాఖలో ఎనిమిదిమంది గుమాస్తాలు 'వృథా! వృథా!!' అన్నారు. 'కదా! కదా!!' అని ఆపళంగా ఆ ఎనిమిది గుమాస్తాలనూ తీసిపారేసి నలుగురు ఆఫీసర్లను వేసుకుని సర్దుకొస్తున్నారు."

''చ్చొచ్చొచ్చో! పాపం-'' అనబోయిన గరటయ్యకడ్డం వచ్చాడు గుమాస్తా. ''ఈ గేట్లు ఒక సుప్రసిద్ధ ఫ్రెంచి ఇంజనీర్ ప్రత్యేకించి తయారుచేసిన నమూనాలో జర్మనీలో పోతపోయించినవి. ఒక్కొక్క గేటులో ఎన్ని వందల కిలోల అందం విరిసిపోతూందో గమనించండి. తెప్పించి ఇప్పటికి పదినెలలయీ చెక్కు చెదరక ఎలా నిలిచివున్నాయో గ్రహించండి. వీటికోసం దాదాపు ఎనిమిదివేల రూపాయల కిమ్మతుగల 'ఫారిన్ ఎక్స్ఛేంజి' ఖర్చయిందని గుర్తుంచండి-ఇలాటిగేట్లు నాలుగుంటే....ఒక్కొదాని కొక్కొ ఆఫీసరయినా వుండొద్దాండి-?'' అన్నాడు.

ఈలోపుగా సి. ఓ. ఇ. ఇ. కారు దిగి ఆ 'బూత్' వెనకాల ఉన్న తనగదిలోకిపోగా, గుమాస్తా గరటయ్య చేతిలోని ఫారం తీసుకెళ్ళి సంతకం పెట్టించాడు. రబ్బరుస్టాంపువేయించి, దాన్ని ఒక ఫైల్లో పడేసి 'పాస్'ను గరటయ్య చేతికిచ్చాడు.

కృతజ్ఞతతో నిండిపోయిన గరటయ్య కొంత కృతజ్ఞతను అక్కడ వంపేసి, ఆదరాబాదరాగా భవనంలోకి వెళ్ళిపోయాడు. అడిగిన ఏడు గుమ్మాలలోనూ 'పాస్' చూపించి, చివరకు అసలు కార్యాలయంలోకి అడుగుపెట్టాడు. "పి. ఏ. టు ది ఓవరాల్ ఆఫీసర్ ఇన్‌ఛార్జ్'' అన్న బోర్డున్న గదిలోకి పోబోగా ఆ పి. ఏ. నే బయటికి వచ్చాడు.

ఆయనతో గరటయ్య తా నా "ఓ. ఓ. సి."ని చూడాలన్నాడు. పి, ఏ. పి. ఏ. లా లేతగా నవ్వి—ఓటసి గారు మూడున్నర దాటితే ఉండరు-" అన్నాడు గీతారహస్యం వివరిస్తున్న ధోరణిలో.

"అయితే మరి రేపురావలసిందేనా?"

"రేపు ఆదివారం, ....గనుక సోమవారం రండి-"

"ఓ. ఓ. సి. ఎన్నిగంటల కొస్తారూ...."

"సీనియర్ ఆఫీసర్-ఆయనకు టైమేవిటండీ....ఎప్పుడయినా రావచ్చు. ఎప్పుడొచ్చినా మూడున్నరకుమాత్రం వెళ్ళిపోతారు-" అన్నాడు పి. ఏ.

"మరి....ఈ పాసు—"

"ఈ వాళ్టికి మాత్రమే చెల్లుతుంది-" అని అర్జంటుగా నడిచి ఆ పొడుగాటి వరండాలో వున్న పద్దెనిమిది గదులలోనూ ఒకిదాని లోకి అదృశ్యమయిపోయాడు.

బయటపడ్డాడు గరటయ్య. బస్సుకోసం నిల్చుంచే బస్‌కన్నా ముందు ఆదివారం వచ్చేస్తుందని, నడకలో పడ్డాడు.

సోమవారం వచ్చింది. రిక్షామీద పయనించి సరిగ్గా పదకొం డింటికల్లా గమ్యం చేరాడు గరటయ్య. దారిలో ఒకచోట 'ఇచట తినుబండారములన్నియు అప్పటమయిన కల్తీనూనెతో తయారు చేయబడును-' అన్న బోర్డున్న మిఠాయి దుకాణంలో ఒక శేరు జిలేబీలను కొన్నాడు. 'ఎంక్వైరీ' గుమాస్తాకు వెన్నరాచి పదినిము షాలలో 'పాస్' సంపాదించాడు. పి. ఏ. టు ఓ. ఓ. సి. గదిలోకి వెళ్లాడు.

ఆ పి. ఏ. చాలా పనిమధ్య ఉన్నట్లున్నాడు. గరటయ్య సకి లించి, ఇకిలించి అతడిదృష్టి నిటు మళ్ళించాడు.

"ఓ....వచ్చారా?" అని మళ్ళీ పనిలో మునిగిపోయాడు పి. ఏ.

గరటయ్య సంచిలోనుండి జిలేబీల అట్టపెట్టె తీశాడు. దాన్ని టేబిల్ మీదవున్న రెండు లావుపాటి ఫైళ్ళ మధ్య పెట్టేశాడు. ఇంకాస్సేపు తర్వాత పి. ఏ. తలెత్తిచూసిన సందర్భంలో- "మా వూళ్ళో చక్కటి పాడి వుందిలెండి....ఆవునేతితో చేసినవి. ఆరోగ్యానికి మంచిది కదండీ-" అన్నాడు.

"మరే....పోయిన మాసమల్లా విపరీతమయిన నీరసంతో బాధపడ్డాను...." అని ఆరెండు లావుపైళ్ళనూ లాఘవంగాతీసి టేబుల్ లాకర్‌లోకి నెట్టేసి తాళం వేశాడు పి. ఏ.

అరగంటలో గరటయ్య ఓవరాల్ ఆఫీసరుగదిలో, ఏతద్ ఓవరాలు ఎదుట ఆసీనుడయ్యాడు.

తిన్నగా తను వచ్చిన పనేమిటో గబగబ చెప్పేశాడు గరటయ్య. ఆ చెప్పడం నలభై నిముషాలు పట్టింది....ఓవరాల్ ఓ గంట ప్రశ్నలడిగాడు. వాటన్నిటికీ సమాధానాలుచెప్పాడు గరటయ్య. అన్నీ విన్నతర్వాత అకస్మాత్తుగా ఓవరాల్‌గారొక మీట నొక్కారు.

గర్రుమంటొక గదిబయిటగంట. ఓ డవాలీ బంట్రోతు వచ్చి నిలిచాడు. "ఈయన్ను హెచ్. సి. ఇ. కు తీసుకువెళ్ళు" అన్నారు; అని, గరటయ్యకేసి చూసి, "మాశారా మీరు తప్పు డిపార్టుమెంటుకొచ్చారు. మీరు వెళ్ళవలసింది హేండిక్రాఫ్ట్స్ అండ్ కాటేజి ఇండస్ట్రీస్ బ్రాంచికి-" అన్నాడు.

"ఓహో!" అని గరటయ్య డవాలు బంట్రోతు వెంటబడి లిఫ్టుఎక్కి నాలుగో అంతస్తు చేరాడు.

"అదిగో, అదే హెచ్. సి. ఇ.-" అని చూపించి మాయమయ్యాడు డవాలి.

అటునడచిపోతున్న గరటయ్య నొకాయన ఆపాడు. ఆ ఆసామి కాషాయ రంగు పంట్లామూ, మెడదాకా బొత్తాలు బిగించిన గళ్ళకోటూ వేసుకుని వున్నాడు. కొద్దిగాపెరిగిన గడ్డంతో చాలా

దీనంగా కనిపించాడు. ఆయన ఎడమచేతిలో లావుపాటితోలుసంచి ఒకటివుంది. దానిని మోయలేక మోస్తున్నట్లుంది.

ఆయన గరటయ్యతో అన్నాడూ- "చూడండిసార్! ఒక్క వారంనుండి తిరుగుతున్నాను. ఈ మహాభవనంలో ఇంతమంది ఆఫీసర్లున్నారా, ఒక్కరన్నా నామాట వినిపించుకోరేం....ప్చ్....ఏం మనుషులండీ...." అని చేతనున్న తోలుసంచిని కాస్త పైకెత్తి "ఇందులో ఏముందనుకున్నారూ-? నికార్సయిన కోబాల్టు బాంబులు; వాటర్‌హామ్లర్ సూత్రంమీద చేసినవి....ఈమధ్య ఊసుపోకుండా కూచుని, హాబీగా ఓ అయిదారు వందల బాంబులు చేశాను. చేతిచమురంతా అయిపోయింది. సరే, వీటిని అమ్మేద్దామనుకున్నాను. వీటిని కొనుక్కోమంటే కొనరేం .... ఏంసార్ .... మీరన్నా చెప్పండి. ఏంచెయ్యమంటారు?"

"పోనీ....రెండేసి బాంబులుకొంటే ఒక ఆంజనేయదండకమో, ప్లాస్టిక్ దువ్వెనో ఉచితంగా ఇస్తానని చెప్పలేకపోయారా-" అని సలహాకరించాడు గరటయ్య.

"అదీ అయిందిసార్....ప్రతీమూడేసి బాంబులకు ఒకటి 'ఫ్రీ'గా ఇస్తానన్నాను...."

"అయితే ఒకపని చెయ్యండి.... మొదటి అంతస్తులో ఓవరాల్ ఆఫీసర్ అని ఒకాయన వుంటాడు. ఆయన్ని కలిశారా?"

"లేదే!" అన్నాడా ఆసామి.

"బహుశ మీరు మూడున్నర తర్వాత వచ్చివుంటారు. ఈ ఓవరాల్ అనేది సాయంకాలం ఐదింటికి ఆఫీసుకొచ్చినా మూడున్నరకే వెళ్ళిపోతుంది. అందుకని కాస్తకనిపెట్టి కలుసుకోండి. ఏవంటే, ఇహ అహోరాత్రాలూ బాంబులూ అవీ ఏకటాకీన కొనిదాచేస్తుండడమే - ఆయనపని...."

"నిజంగానే?"

"మరే.... ఆయన ధగ్గరకు వెళితే మీ సరుకంతా అయిపో తుంది. పై పెచ్చు ఇంకో రెండు మూడు వేలకు ఆర్డర్ రావచ్చు కూడా-"

"థాంక్యూ! థాంక్యూ!"

"అథవా కొనడానికి కొంచెం సందేహించాడనితోస్తే ఓచిన్న బాంబు పేల్చి చూపించండి-" అన్నాడు గరటయ్య.

"బలేబలే! చాలామంచి ఐడియా ఇచ్చారు సార్: మీకు ఎంతో ఋణపడ్డాను.... నా కృతజ్ఞతకు చిన్నసూచనగా ఓ రెండు బాంబులిస్తాను తీసుకోరూ-" అన్నాడు ఆయన తోలుసంచిమూత తీయబోతూ.

గాభరాగా ఆయన చేతులు పట్టుకుని ఆపి, "అబ్బే-ఇప్పుడొద్దు లెండి. ఆనక క్రిందికొచ్చినప్పుడు తప్పక తీసుకుంటాలెండి...ఈ లోపుగా మీబేరం ముగించండి .. వస్తానుసి..." అని హెచ్. సి. ఐ. గదిలోకి వెళ్ళిపోయాడు గరటయ్య.

ఆ ఆఫీసరుగారు ఎవరితోనో మాట్లాడుతున్న వాడల్లా ఇటు తిరిగి గరటయ్య కో కుర్చీచూపించి, అటుతిరిగి తన సంభాషణ సాగించాడు ఒక రచయితతో.

"అదిసరేనండీ: కాగితంమీద కలంతోరాయడం అన్నది... చేతిపరిశ్రమే! కాదనను - సరే మీ పుస్తకంలోని విషయమా - 'భారతదేశాన్ని జయించడానికి నాలుగు సులభమార్గాలు-' అన్నది ఈకాలానికి కావలసిన గొప్పవిషయం... ఇహ ఈ పుస్తకం తాలూకు కాపీలు చైనాలో, పాకిస్తానులో విపరీతంగా అమ్ముడుపోయి మనకు కోట్లకొలది "ఫారిన్ ఎక్స్ఛేంజ్" రావచ్చు-ఒప్పుకున్నాను. ఇవన్నీ సరే-"

"మరయితే ఇంతటి గొప్పగ్రంథాన్ని ప్రకటించడానికి మీరెందుకు ఒప్పుకోరు-" అని టేబిల్‌మీద గుద్ది అడిగాడు రచయిత. ఆ గుద్దు కొక నల్లసిరా బాటిలూ, ఒక ఎర్రసిరా బాటిలూ ఒలికి అక్క

డున్న ఆ ముగ్గురిమీదా సిరా చిలికాయి... రచయిత మొహం మీదా గరటయ్యా మొహంమీదా కన్పడ్డ బాధను గమనించిన ఆఫీసరు-"అబ్బే! మీ బట్టలు పాడయిపోయాయని భ్రమపడకండి...ఈ సిరాలు 'లోయెస్టు టెండరు' తో కొన్నవి కదండీ-అంచేత ఎండితే కనపడవు-" అని సర్దిచెప్పి రచయితతో అన్నాడు-"ఎటొచ్చీ మీరు చేసిన చిన్నపొరబాటేమిటంటే తప్పు డిపార్టుమెంటు కొచ్చారు.. అంతే.. మీరు బి. అండ్ పి-అంటే బుక్సు అండ్ ప్రింటింగ్ సెక్షన్‌లోకి వెళ్ళాలి. అక్కడికి వెడితే వాళ్ళు మీ సలహాను పరిశీలించగలరు-అదీ సంగతి."

"ఊ...సరే...అదీ చూస్తా! వాళ్లు కనక సాయం చెయ్యక పోతే మీ దగ్గిరికే వస్తా - మీ స్వంత డబ్బన్నాపెట్టి ఈ పుస్తకం వేయించవలసిందే-ఆ!" అని టేబిలు గుద్దబోయి మానుకుని, తన మహాగ్రంథాన్ని చంకను పెట్టుకుని బయటకు నడిచాడు-రచయిత.

"అమ్మయ్య!" అనుకుని-ఆఫీసరు గరటయ్యావైపు చూశాడు. "అయ్యా! భూషణరావుగారూ!" అని మొదలెట్టాడు గరటయ్యా. ఆఫీసర్ మొహాన ఆశ్చర్యం వెలిగింది.

"బయట బోర్డుమీద మీపేరు చూశాలెండి..." అన్నాడు గరటయ్యా.

"ఆబోర్డు ఎందుకనుకున్నారు. నేను ఇంకోరి గదిలోకి వెళ్ళిపోకుండా తిన్నగా నాగదిలోకి రావాలని. అంతే కాని మీరు నన్ను పేరెట్టి పిలవాలనికాదు .. మీరునన్ను కేవలం 'డెసిగ్నేషన్' తోనే వ్యవహరించాలి-రెఫర్ ఫండమెంటల్ రూల్స్, చాప్టర్ ఫోర్-"

అడ్డం పడ్డాడు-"అయ్యా! అయ్యా! నేను మిమ్మల్ని మీ పేరుతో పిలవన్లెండి . ఇంతలో రూల్సుని పిలవకండి. కాస్త నేచెప్పేది వినండి-" అని గొంతు సరిచేసుకున్నాడు గరటయ్యా. మా మేనత్త మూడో కూతురిని దానిభర్త విడిచిపెట్టి కాశీవెళ్ళాడు; ఆరేళ్ళయింది. మా కోడలు చెల్లెలు సీతాయి వుంది చూశారూ-మాంచి చురుకయిన

ఘటంలెండి-దానికి పదోయేట పెళ్ళిచేస్తే పన్నెండోయేట పసుపూ కుంకుమ పోగొట్టుకుంది. మా పిన్నిమనవరా లొకతి మూడోఫారం పాసయింది; దానికోసం తొమ్మిదేళ్ళనుండి వెతుకుతుంటే తగిన సంబంధం దొరకక ఇంకా పెళ్ళికాలేదు-''

''అయ్యా! మీరు ఏ వివాహాలు ఏర్పాటు చేసే సంస్థ వద్దకో, లేక జ్యోతిష్కుడి వద్దకో వెళ్ళాలేమో-" అని బంట్రోతుకోసం మీట నొక్కబోగా ఆఫీసర్ చేతిని ఆపాడు గరటయ్య.

"ఆరచయిత నంతసేపు మాట్లాడనిచ్చారే. నన్నోమూడు నిముషాలన్నా మాట్లాడ నివ్వరేం.... కనకా—ఈ విధంగా చాలా మంది బంధువర్గపు ఆడసరుకు మాయింటోకి దిగుమతి అయిపోతు న్నారు. వచ్చేనెలలో ఇంకో ఇద్దరు రావాలి. వాళ్ళ దురదృష్టమేమి టంటే-పోన్లెండి అకథ చెప్పన్లెండి.... ఇలా ఇంట్లో, మంది హెచ్చి పోతున్నకొద్దీ ఆర్థికమయిన డబ్బు ఇబ్బందులనేవి—మనదేశంలో కమిటీల్లాగున—దారుణంగా పెరిగిపోతున్నాయి. వాటి నెదుర్కోవ డానికని చాలా ఆలోచించి ఒక పథకాన్ని తయారుచేశాను. అపథకం గనక అమలులోకి వచ్చిందంటే నాఇబ్బందులు తీరిపోవడమేగాక, సాంఘికసేవ జరగడమేగాక, మన రాష్ట్రానికి బోలెడు రాబడి వస్తుంది—"

"ఏమిటా పథకం?" అన్నా డా ఆఫీసరు.

"అప్పడాలు తయారు చెయ్యడం—'' అన్నాడు గరటయ్య.

''ఏమిటీ—అప్పడాలా?''

''ఆ, అప్పడాలే! చక్కటి కారపు అప్పడాలు, మినప అప్ప డాలు, బియ్యపు అప్పడాలు—ఇవన్నీ ఆంధ్రత్వం గుబాళించేటట్లు తయారుచేసి, మాంచి సెల్లోఫేన్ పేకింగ్‌లోవుంచి, రేడియోల్లో, సినీమాల్లో ప్రకటనలు చేయిస్తే - దాన్లో ఎంత డబ్బుందనీ-"

''ఎంతుంటుం దేమిటి?"

"లక్ష! పది! కోటి - ఎంత అయినా వుంది.... మనం వీటిని పారినుక్కూడా పంపొచ్చు - ఏమంటారు?"

"ప్రస్తుతం ఏమీ అనను. మీరు ఈ హెచ్. అండ్ సి. ఐ. డిపార్టుమెంటు కెందుకొచ్చారో చెప్పమంటాను-"

"ఎందుకేమిటి-అప్పడాలు చెయ్యడం చేతిపరిశ్రమ గనకా - భారీ ఎత్తున ఆ పరిశ్రమ స్థాపించదలచుకున్నానుగనకా - అందు నిమిత్తం (1) లైసెన్సు (2) ఓపాతికవేలదాకా అప్పూ అవసరం గనకా-"

"ఓహో!" అని ఆఫీసరుగారు ఫోనుతీసుకున్నారు. "ఎవరూ-ఓవరాల్ బ్రాంచేనా-ఏవిటోయ్‌వాసూ! నేనేం చేశానునీకు: పొద్దునలేచి ఆ రచయితగారినీ, ఈ అప్పడాల ఆయన్నూ....వీళ్ళంద రినీ నామీది కిలా పంపిస్తావేం-" అని ఫ్రెంచిభాషలో అడిగాడు.

అవతలి కొసనుంచి ఓవరాల్ ఆయన అన్నాడుకదా - "ఏమయ్యా భూషణరావ్! నువ్వు మాత్రం ఆ బాంబులవాడిని మీదకు తోలవచ్చేం .... వారంరోజులనుండి వాడికంటబడకుండా తప్పిం చుకు తిరుగుతున్నవాడిని, ఇవాళ చిక్కడిపోయాను; గంటాయి. వాడిని వదిలించుకోలేక ఛస్తున్నా-"

"సరేలే! నీపని ఇట్లాఉందా - రేపట్నుంచి ఇంకా ఎట్లాంటి వాళ్ళను పంపిస్తానో చూచుకో-" అని ఫోన్ పెట్టేసి ఆ ఆఫీసర్ గరటయ్యను చూచి "అయ్యా! ఓ నిముషం వుండండి" అని ఒక లావుపాటి పుస్తకంతీసి, అందులో అక్కడక్కడా కొన్ని పేజీలు తిరగేసి "అబ్బే! ఈ మాన్యువల్‌లో ఎక్కడాకూడా అప్పడాలకు లైసెన్సు ఇవ్వమనిలేదు మరి-కనక మీరు ఓసారి లోన్స్ డిపార్టు మెంటుకెళ్ళిరండి. ఈ లోపుగా ఇంకేవన్నా కొత్తరూల్సు వచ్చా యేమో చూస్తా।" అన్నాడు.

సగంచచ్చిన గరటయ్య 'లోన్స్' శాఖను వెతుక్కోబోగా వరండాలో ఇద్దరు మగాళ్ళు కుస్తీపట్టుకుంటూ కనిపించారు. ఇదే విటా అని చూడబోయిన గరటయ్యానొక పారిజాతం పలకరించింది.

"ఏమండీ! ఏమండీ! వాళ్ళిద్దరినీ విడదీయండీ-" అని ప్రాధేయపడింది ఆ పాతికేళ్ళ పారిజాతం.

భయంతో వణికిపోతున్న ఆ గులాబీరంగు లిప్‌స్టిక్ పెదవుల కేసిచూస్తూ అడిగాడు గరటయ్య- "వీళ్ళిద్దరిలోనూ దారాసింగు ఎవ రేవిటి?"

"అబ్బే....ఎవరూకాదు: ఆ కోటు చిరిగినాయన- ఆ కోటు ఇప్పుడే చిరిగిందిలెండి. ఆయన- మా ఆఫీసరు. నేను ఆయన స్టెనో గ్రాఫరుని.... ఇందాకా నేనేమో మామూలుగా ఆయన సరసన కూచుని డిక్టేషన్ రాసుకుంటుంటే.... (అబ్బా....ఏం గుద్దుతున్నా డండీ....) ఇదిగో ఈ కళ్ళజోడాయన, వాళ్ళబ్బాయి ప్రమోషన్ ఆలస్యమయిపోయిందట. అడగడానికి వచ్చాడు. మాదేమో "మురికి నీళ్ళు మరియు వేస్టుపేపర్" బ్రాంచిఆయె.... (అయ్యో అయ్యో! మాబాస్ ముక్కుచూడండి. అప్పడాల పిండిలా అయిపోతూంది.) కనక మా దొరవారు ఈయనతో తప్పు డిపార్టుమెంటు కొచ్చారని చెప్పేసరికి - ఈయనేమో నాలుగురోజులనుండి తిరుగుతున్నాడట. అన్నిడిపార్టుమెంటులవాళ్లూ మేం కాదంటే మేంకాదన్నార్ట - ఈయ నకు విపరీతమయిన కోపంవచ్చి మాదొరగారి (అబ్బా!...; ఏంతిం టున్నాడండి మాదొర-) చెంప ఛెళ్లుమనిపించాడు-అదీ ఆరంభం-" అని వివరించిం దా లలన.

ఈ లోపుగా ఆ మురికినీళ్ళఆఫీసరూ, కళ్ళజోడాయనా కుస్తీ ఆపేసి రాజీకి వచ్చినట్లు నిల్చున్నారు. ఆసందర్భంలో ఆ ఆఫీసరు గారిదేహం ఏదో ఎగుడుదిగుడుగా వున్నట్లు గమనించిన గరటయ్య,

ప్రశ్నార్థకంగా పారిజాతంవైపు చూశాడు. ఆమెఅందీ- ''అబ్బే! అది ఈ కుస్తీవల్ల అయిందికాదు. తను కేవలం అయిదుఅడుగులే వున్నానని కుమిలిపోతున్న మా ఆఫీసరువారికంట ఒక లూధియానా ప్రకటన కనపడింది. ఆపళంగా 'పొడుగు పెరగండి' మాత్రలు ఓ అయిదారుడజన్లు తెప్పించేసి తినేశారు. మూడువారాలయేసరికి ఆయన ఎడమకాలు మాత్రం మూడంగుళాలు పెరిగింది. కుడికాలు వూరు కుంది. దాని ఫలితమే ఆయ నలా కాస్త ఏదోగా—''

ఈ లోపుగా కాస్త గాలిపీల్చుకున్న తర్వాత కళ్ళజోడాయనా, ఆఫీసరూ మళ్ళీ దిగారు కుస్తీలోకి.... రక్షణనిమిత్తం ఇంకెవరినైనా పిలుచుకొద్దామని పరుగెత్తింది పారిజాతం.

కళ్ళజోడాయన చేస్తున్న నిస్వార్థమయిన ప్రజాసేవకు జోహారు లర్పించి, గరటయ్య 'లోన్స్' శాఖలోకి వెళ్ళాడు... అక్కడ మొదట కన్పించిన పి. ఏ. కనిపిస్తే తన బాధంతా చెప్పు కున్నాడు.

పి. ఏ. ఆశ్చర్యపడ్డాడు - ''అదేవిటండీ - ఇందాకా మీరు నాటేబిల్‌మీద ఆ రెండుపైళ్ళనూ తీసి వుంచారుగా-'' అని కరుణతో గరటయ్యకు ఉపదేశం చేశాడు.

''భేషో!'' అని గెంతుకు ఆరుమెట్లు చొప్పున వెళ్ళిపోయి హెచ్. సి. ఐ. ని చేరాడు. అక్కడో రెండుపైళ్ళని తీసుకుని, వాటిని వెనక్కుంచాడు. ఓ అయిదు నిముషాలు కూర్చున్నాడు.

''ఏమండోయ్! మరే... ఇక్కడ మాన్యువల్లో - ఇనస చక్రాలూ, స్టీలుపళ్ళేలూ చేయడానికి అనుమతి ఇవ్వచ్చని రూల్ 162 లోని 9 వ సబ్‌పేరా అంటూంది. ఆఫ్టరాల్ అప్పడాలంటే ఏవిటి? మరోరకం చక్రాలు, కాకపోతే ఇంకోలోహంతో చేసిన

వశ్శేలు... కనక మీరు ఈ సబ్ పేరా ప్రకారం లైసెన్సు ఇచ్చేయ వచ్చు...'' అన్నాడు హెచ్. సి. ఐ. ఆఫీసరు.

అని ముగించాడో లేదో బ్రహ్మాండాలు బద్దలయేట్టు 'ఢాం' అని చప్పుడు వినపడింది. ఆ భవనమంతా గజగజలాడింది. నిలువెల్ల చలి బుట్ట నోరు తెరిచాడు ఆఫీసరు.

గరటయ్య-''ఏమీ భయపడకండి...ఆ గడ్డమాయన ఓ బాంబు పేల్చినట్లుంది ..'' అని ఆఫీసరు భుజం తట్టాడు.

మూడు రోజుల క్రింద మహానగరంలోకి అడుగు పెట్టినవాడు గరటయ్య.

ఈ రాత్రి, అప్పడాల పరిశ్రమకు లైసెన్సుతో, ముప్పైవేల రూపాయల ఋణ సౌకర్యానికి హామీతో, రైలెక్కిన వాడు భారత పౌరుడు గరటయ్య.

[మనవి : ఇందులోవన్నీ నీడలు. కుస్తీకి రాకండి.]